సాక్షి
హనుమకొండ
మంగళవారం । 2 । జూలై । 2024



మట్టి, ఇసుక కావాలి

కేఎంటీపీలో యంగ్ వన్ కంపెనీ పనులు త్వరగా చేపట్టేందుకు మట్టి, ఇసుక కావాలని ఆ కంపెనీ ప్రతినిధులు కోరారు. - 8లో▸



ప్రమోషన్..పరేషాన్

టీజీఎస్ ఆర్టీసీ టైర్ వర్క్‌షాపులో పనిచేస్తున్న కార్మికులపై యాజమాన్యం, అధికారులు వివక్ష చూపుతున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$35^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదక వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేయూ పరీక్షల్లో నలుగురు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ దూరవిద్య పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మొదటి సంవత్సరం పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ పట్టుబడి నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. 13 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా.. 1,584 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా.. వారిలో 1,093 మంది విద్యార్థులు హాజరయ్యారు. హనుమకొండలోని యూఏఎస్‌సీ పరీక్ష కేంద్రంలో ఇద్దరు, సికింద్రాబాద్‌లోని పీజీ కాలేజీ పరీక్ష కేంద్రంలో ఇద్దరు కాపీయింగ్ చేస్తూ పట్టుబడి డీబార్ అయినట్లు వారు తెలిపారు.

జాతీయ స్థాయి శిక్షణకు విద్యార్థుల ఎంపిక


అక్షయ్‌రామ్, గండి వర్ష

విద్యారణ్యపురి: గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో ఆగస్టు 4 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత జాతీయ ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈఓ అబ్దుల్ హై సోమవారం తెలిపారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పంథినిలో పదోతరగతి చదువుతున్న కర్ణకంటి అక్షయ్‌రామ్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కాజీపేటకు చెందిన గండి వర్ష ఈజాతీయ శిక్షణ శిబిరానికి ఎంపికయ్యారు. వీరికి గైడ్ టీచర్‌గా కాజీపేట బాలికోన్నత పాఠశాలకు చెందిన బి.సునీత విద్యార్థులతో పాటు గుజరాత్ వెళ్లనున్నారు. విద్యార్థులను డీఈఓ ఎండీ అబ్దుల్‌హై జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్ అభినందించారు.


నేడు 'రైతు నేస్తం'

హన్మకొండ: రైతులకు సలహాలు, సూచనలందించే రైతు నేస్తం కార్యక్రమాన్ని ఈనెల 2న నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ తెలిపారు. జిల్లాలోని పలివేల్పుల, పరకాలలోని రైతు వేదికల్లో రైతు నేస్తాన్ని వీక్షించవచ్చని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి ప్రారంభోపన్యాసం ఉంటుందని, 10.5 గంటలకు విత్తన ఎంపికపై అవగాహన కల్పించే పాట, 10.10 గంటలకు సమగ్ర వ్యవసాయ విధానంపై వీడియో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. 10.15కు సమగ్ర వ్యవసాయ విధానం, నేరుగా విత్తనం వెదజల్లే పద్ధతిపై రైతుల అనుభవాలు వివరిస్తారు. 10.35కు శాస్త్రవేత్త ఎం.గోవర్ధన్ సలహాలు, సూచనలు ఇస్తారు. 10.50కి రైతుల అభిప్రాయాలు స్వీకరిస్తారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

కాజీపేట అర్బన్: రిజిస్ట్రేషన్ కార్యాలయాలకనుగుణంగా మండలాల మార్పుతో వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల జోరు తగ్గింది. సోమవారం నుంచి మండలాల మార్పుతో భూక్రయవిక్రయదారులకు రిజిస్ట్రేషన్లను సులభతరం చేసేందుకు వీలుగా మార్పులు చేపట్టగా.. సోమవారం వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వరంగల్‌కు బదులుగా ఐనవోలు మండలాన్ని కేటాయించారు. కాగా.. సాధారణంగా ప్రతీ రోజు వరంగల్ ఆర్‌ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 150కిపైగా దస్తావేజులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకుంటుండగా.. సోమవారం మండలాల మార్పు ఎఫెక్ట్‌తో కేవలం 109 దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నాయి. దీంతో ఖజానాకు రూ.70 లక్షల ఆదాయం సమకూరినట్లు సమాచారం.

ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి



ఎంజీఎం: విధి నిర్వహణలో డాక్టర్ బీసీ రాయ్‌ని ఆదర్శంగా తీసుకొని ప్రతీ వైద్యుడు జాతి నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ.. ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ బి.సాంబశివరావు వైద్యులకు సూచించారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్‌పాషా, ప్రోగ్రాం ఆఫీసర్లు ఉమాశ్రీ, ఇఫ్తాకర్ అహ్మద్, హిమబిందు, స్పందన, నాగరాజు, శ్రీనివాస్, ప్రహసిత్, గోపాలరావు, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, ఎస్‌ఓ ప్రసన్నకుమార్, ఏఓ చంద్రకళ, వైద్యులు పాల్గొన్నారు.

మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్!

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ ఫోకస్

- త్వరలో కాంగ్రెస్‌లోకి బస్వరాజ్ సారయ్య?
- తక్కళ్లపెల్లి రవిందర్‌రావు, బండ ప్రకాష్‌లపై ప్రచారం
- సోషల్ మీడియాలో సీఎం రేవంత్‌తో ప్రకాష్ ఫొటో
- ప్రచారాన్ని కొట్టిపారేసిన ఆ ఇద్దరు ఎమ్మెల్సీలు



సాక్షిప్రతినిధి, వరంగల్:

'ఆపరేషన్ ఆకర్ష్'పై మళ్లీ ప్రచారం జోరందుకుంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారంటూ సోషల్ మీడియాలో పుకార్లు షికారు చేస్తున్నాయి. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తిరిగి సొంతగూటికి చేరుతారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పటికే రామసాయం సురేందర్‌రెడ్డిని కలిసిన ఆయన.. గత నెల 29న సీఎం రేవంత్ రెడ్డి సమీక్షకు హాజరై ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో సంప్రదింపులు జరిపినట్లు చర్చ జరుగుతోంది. బస్వరాజు సారయ్యతోపాటు మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవిందర్‌రావులపైన సోమవారం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బండ ప్రకాష్ ఫొటో చక్కర్లు కొట్టింది. అయితే దీనిపై వేర్వేరుగా స్పందించిన బండా ప్రకాష్, తక్కళ్లపెల్లి రవీందర్‌రావులు తమపై జరుగుతున్న తప్పుడు ప్రచారంగా కొట్టిపారేశారు. బీఆర్‌ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఎమ్మెల్సీ రవీందర్‌రావు స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశాల సందర్భంగా కర్టసీగా సీఎం కలిసిన ఫొటోలను తాజా ఫొటోలుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ప్రకాష్ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీల్లో ఓరుగల్లుకు బీఆర్‌ఎస్ పెద్దపీట...

గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ పదవుల్లో ఉమ్మడి వరంగల్‌కు పెద్దపీట వేశారు. ఎనిమిది మంది సీనియర్ నేతలకు అవకాశం ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో, పార్టీ ప్రస్థానంలో వెన్నుదన్నుగా ఉన్న ఈ జిల్లాకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించారు. సత్యవతి రాథోడ్, బస్వరాజు సారయ్య, పల్లా రాజేశ్వర్ రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, డా.బండ ప్రకాశ్, సిరికొండ మధుసూదనచారిలకు వివిధ కేటగిరీల కింద ఎమ్మెల్సీలుగా చాన్స్ దక్కింది. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జనగామ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో రాజీనామా చేయగా, ఆయన స్థానానికి జరిగిన ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న(కాంగ్రెస్) ఇటీవలే గెలిచారు. ఎమ్మెల్సీగా ఉండి స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన కడియం శ్రీహరి సైతం గెలుపొందినా.. ఆయన కూడా ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల సంఖ్య ఆరుకు తగ్గింది. కాగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలలో కలిసొచ్చే వారిపై కాంగ్రెస్ గురిపెట్టడం చర్చనీయాంశమవుతోంది.

బీఆర్‌ఎస్‌కు గట్టి షాకేనా?

నేతల వలసలతో ఇప్పటికే సతమతమవుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి ఉమ్మడి వరంగల్‌లో మరో షాక్ తగిలేలా ఉంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలపైన కాంగ్రెస్ అధిష్టానం ఫోకస్ పెట్టడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటికే బస్వరాజు సారయ్య కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు సైతం అదే దారిలో ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత నెల 29న సీఎం రేవంత్ వరంగల్ పర్యటన సందర్భంగా ఆయన సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో సారయ్య భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చేరికలపై చర్చించారన్న ప్రచారం జరిగింది. మాజీ ఎంపీ రామసాయం సురేందర్ రెడ్డిని కలిసిన సందర్భంగా రెండు నెలల క్రితమే సారయ్య కాంగ్రెస్‌లో చేరుతారని భావించారు. అయితే ఆయనతోపాటు ఒకేసారి 10 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం, సీఎం భావించి బ్రేక్ వేశారన్న ప్రచారం కూడా సాగింది. కాంగ్రెస్ పార్టీలో చేరే విషయమై ఎమ్మెల్సీ సారయ్య కూడా స్పష్టత ఇచ్చారు. డా.బండా ప్రకాష్, తక్కళ్లపెల్లి రవీందర్ రావులు మాత్రం చేరిక ప్రచారాన్ని ఖండిస్తున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంచుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



ప్రజల కోసం కొట్లాడతా..

కమలాపూర్: హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల కోసం ఎంతకైనా కొట్లాడతానని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ మండలానికి మంజూరైన రూ.80,09,280 విలువైన 77 కల్యాణలక్ష్మి, 3 షాదీ ముబారక్ చెక్కులను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆడబిడ్డకు మేనమామగా కేసీఆర్ రూ.1,00,116 పంపించాడని చెప్పి ఇంటింటికి వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్ని రోజులు చెక్కులు ఇవ్వకుండా ఆపితే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఇస్తారని ఆశించానని, కానీ.. కేసీఆర్ ఇచ్చిన రూ.1,00,116 చెక్కులే ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పుడు మరో 118 చెక్కులకు సంబంధించి ప్రతిపాదనలు పంపిస్తున్నామని, ఆ చెక్కులతోనైనా తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

న్యాయం గెలిచినందుకు సంతోషంగా ఉంది..

న్యాయం గెలిచినందుకు చాలా సంతోషంగా ఉందని కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో వందలాది మంది లబ్ధిదారులను ఈ ప్రభుత్వం ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసిందని, జీఓ ప్రకారం ఎమ్మెల్యేగా తాను చెక్కులు పంచాలని క్లియర్‌గా ఉందని, అయినా పంచనివ్వడం లేదని గత నెల 26న హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. జీఓ ఫాలో కావాలని, చెక్కులు పంచాలని కోర్టు సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చిందన్నారు. 'నా మీద కోపం ఉంటే నా మీద తీర్చుకోండి కానీ నా హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల మీద ఆ కోపం తీర్చుకోవద్దు' అని అన్నారు.

అంతకుముందు కొందరు వీఆర్‌ఏలు కౌశిక్‌రెడ్డిని కలిసి జీఓ 81, 85 ప్రకారం సుమారు 18 మందికి ఇంకా ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కల్యాణిలక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, లక్ష్మీరవీందర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శోభారాణి, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భారీగా మోహరించిన పోలీసులు..

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వస్తున్నాడని తెలియడంతో ఇటు బీఆర్‌ఎస్ నాయకులు, అటు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి, హసన్‌పర్తి సీఐలు ప్రవీణ్‌కుమార్, సురేశ్, ఎస్సైలు వీరభద్రరావు, రాజు, 30 మంది పోలీసులు అక్కడ మోహరించారు.

● ఆసిఫాబాద్ ఘటనపై సరే..

భీమారం అక్రమాల మాటేంటి!

- భూసేకరణ పరిహారం పంపిణీలో అక్రమాలపై ద్వంద్వ వైఖరి
- వరంగల్ ఆర్డీఓ సిడాం దత్తు అరెస్ట్.. భీమారం ఘటనపై చర్యలేవి?
- భువనగిరి – ఆరెపల్లి హైవే కోసం అప్పనంగా రూ.9.19 కోట్లు
- ఏడేళ్లు దాటినా రికవరీ లేదు.. కేసులు లేవు.. ఏసీబీకి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- 'రియల్' వ్యాపారి, రెవెన్యూ అధికారులకు పొలిటికల్ అండ?


ప్రభుత్వం పరిహారం చెల్లించిన భీమారం హైవే వెంట ఉన్న వెంచర్ ఇదే..

సాక్షిప్రతినిధి, వరంగల్ :

భూసేకరణ పరిహారం పంపిణీలో అక్రమాలపై రెవెన్యూ, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ద్వంద్వ వైఖరిని అవలంబించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారుల నిర్మాణం కోసం చేసిన భూసేకరణలో భారీగా జరిగిన అక్రమాలపై అప్పట్లో 'లోకాయుక్త', చీఫ్ సెక్రటరీ, ఏసీబీలకు ఫిర్యాదులు అందాయి. ఇందులో ఆసిఫాబాద్ జిల్లా జన్కాపూర్ శివారు ప్రాంతం మీదుగా వెళ్లే 363 జాతీయ రహదారి.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం భీమారం మీదుగా వెళ్లే 163 భువనగిరి – వరంగల్ హైవే బైపాస్ రోడ్డులు ఉన్నాయి. ఈ రెండు హైవేల నిర్మాణం చేసిన భూసేకరణలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేసి అమ్ముకున్నాక.. సదరు వ్యాపారులకు అధికారులు రూ.13.51 కోట్లు చెల్లించడం వివాదాస్పదమైంది. ఈరెండు ఘటనలపై రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు వెళ్లగా విచారణకు ఆదేశించారు. ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించిన రూ.4.32 కోట్లు చెల్లింపులపై విచారణ జరిపిన ఏసీబీ అప్పటి అక్కడి ఆర్డీఓ (ప్రస్తుతం వరంగల్ ఆర్డీఓ) సిడాం దత్తును ఆదివారం అదుపులోకి తీసుకుంది. హసన్‌పర్తి మండలం భీమారం శివారులో భూసేకరణ పేరిట అక్రమంగా చెల్లించిన రూ.9.19 కోట్లపై రెవెన్యూశాఖకు చెందిన ఉన్నతాధికారులనే విచారణాధికారులుగా నియమించగా, అక్రమాలు తేలి ఏడేళ్లు దాటినా ఎటూ తేలడం లేదు.

ఇక్కడ ఇలా.. అక్కడ అలా...

గ్రేటర్ వరంగల్ పరిధి హసన్‌పర్తి మండలం భీమారం శివారులోని సర్వే నంబర్ 353లో సుమారు 14.15 ఎకరాల భూమికి తోడు పక్కన మరికొంత భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 2006లో కొనుగోలు చేశారు. ఇందులో ఓ వెంచర్ ఏర్పాటు చేసి సుమారు 673 ప్లాట్లుగా విభజించి అప్పుడు అక్కడ ఉన్న మార్కెట్ ధర మేరకు విక్రయించాడు. ఈ వెంచర్‌కు 'కుడా' ప్రొసీడింగ్ నంబర్ సీ1/2443/2006 ద్వారా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. 2016లో ఈ వెంచర్‌లోని 14.15 ఎకరాల భూమిలో 4.30ఎకరాల భూమిని రింగ్‌రోడ్డు కోసం సేకరించినట్లు రెవెన్యూ అధికారులు రికార్డులు సృష్టించి వెంచర్ నిర్వాహకుడికి గజానికి రూ.4వేల చొప్పున 22,990 గజాలకు లెక్క కట్టి అప్పుడున్న తహసీల్దార్, ఆర్‌డీఓలు రూ.9,19,60,000లు నష్టపరిహారంగా చెల్లించారు. అదే విధంగా ఆసిఫాబాద్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న జన్కాపూర్ శివారు ప్రాంతం మీదుగా జరిగిన 363 హైవే నిర్మాణం సందర్భంగా రెండు సర్వే నంబర్లలోని భూమిలో సుమారు 15 ఎకరాల్లో వెలిసిన వెంచర్‌లో లేఅవుట్లకు సంబంధించిన 6.12 ఎకరాలను 363 జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరించినట్లు రెవెన్యూ అధికారులు రికార్డుల్లో పేర్కొన్నారు. ఈ భూమికి పరిహారంగా ప్రభుత్వం నుంచి రూ.4.32 కోట్లు చెల్లించారు. అక్కడ సహకరించిన రెవెన్యూ అధికారులకు ప్రతిఫలంగా వ్యాపారుల్లో ఒకరి వద్ద పనిచేసిన డ్రైవర్ బ్యాంకు ఖాతాలోకి రూ.1,15,19,000లు బదిలీ అయ్యాయి. ఆర్డీఓ సిడాం దత్తు తల్లి మల్కుబాయి ఖాతాలోకి రూ.65 లక్షలు, డిప్యూటీ తహసీల్దార్ మేస్రం నాగోరావు సోదరుడు మేస్రం చత్రుషా ఖాతాలోకి రూ.30 లక్షలు బదిలీ జరిగినట్లు విచారణలో తేలడంతో ఏసీబీ అరెస్టులకు దిగడం చర్చనీయాంశంగా మారింది.

భీమారం అక్రమాలపై ఏసీబీ దృష్టి పెడితేనే...

రియల్ ఎస్టేట్ లేఅవుట్ ప్లాట్లు, రోడ్లు, గ్రీన్‌ల్యాండ్‌ను భూసేకరణ కింద చూపి అక్రమంగా రూ.9.19 కోట్లు చెల్లించిన రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారిపై ఉన్నతాధికారులు ఇంకా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రూ.9.19 కోట్లు ఫలహారంగానే మిగిలిపోతున్నాయి. ఈనేపథ్యంలో హసన్‌పర్తి మండలం భీమారం శివారులో జరిగిన భూసేకరణ, పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలపై ఏసీబీ రంగంలోకి దిగితేనే విచారణ వేగవంతం కాగలదన్న చర్చ జరుగుతోంది. రెవెన్యూ రికవరీ యాక్ట్ పెట్టి వసూలు చేసే అవకాశం ఉన్నా ఏడేళ్లు కాలయాపన జరగ్గా.. ఇదేంటని అడిగితే సదరు వ్యాపారికి నోటీసులు ఇచ్చామని, త్వరలోనే వసూలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రూ.9.19 కోట్ల చెల్లింపులపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సిన అవసరం ఉంది. సర్వేనంబర్ల ప్రకారం భూములు ఎవరివి? రియల్ ఎస్టేట్ వెంచర్ ఎన్ని ఎకరాల్లో వేశారు? ప్లాట్లు విక్రయించిన తర్వాత రియల్ ఎస్టేట్‌వ్యాపారికి ఎలా చెల్లించారు? రూ.9.19 కోట్లు చెల్లించిన చెక్కునంబర్లు, వ్యక్తుల పేర్లేమిటి? తదితర అంశాలపై మళ్లీ విచారణ జరపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బదిలీ అందరికి.. రిలీవ్ కొందరికే!

రేషనలైజేషన్ నిబంధన వర్తింపు

- బదిలీ అయినా.. అదే పాఠశాలలో కొనసాగింపు!
- హనుమకొండ జిల్లాలో 319 మంది బదిలీ
- వరంగల్ జిల్లాలో 461 మందికి బదిలీ ఉత్తర్వులు
- బదిలీలు ఎందుకు చేపట్టారంటూ టీచర్ల ఆవేదన

విద్యారణ్యపురి: ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టడంతో తాము కోరుకున్న చోటికి వెళ్లొచ్చని టీచర్లు కలలు కన్నారు. కానీ రేషనలైజేషన్ నిబంధన కారణంగా బదిలీ అయినప్పటికీ కొందరు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలలోనే కొనసాగాల్సి వస్తోంది. పేరుకే బదిలీలు చేపట్టారని రిలీవ్ చేయడం లేదని కొందరు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయుల బదిలీలకు ఆదివారం రాత్రి 10 గంటల వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. ఎడిట్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అదే రోజు అర్ధరాత్రి 12 గంటల వరకు సమయం ఇచ్చారు. సోమవారం వారికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. బదిలీ అయ్యామని తాము కోరుకున్న చోటుకు వెళ్లేందుకు రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని ఎంఈఓల వద్దకు వెళ్లి అడగ్గా..కొందరికి ఆర్డర్స్ ఇచ్చారు. మరికొందరికి ఇవ్వలేదు. దీంతో ఉపాధ్యాయులు ఖంగుతిన్నారు.

బదిలీ అయిన వారిలో సగం మంది..

రేషనలైజేషన్ నిబంధనల ప్రకారం.. 10 మంది విద్యార్థులున్నచోట ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండాలని, 40 మంది వరకు ఇద్దరు ఉపాధ్యాయులుండాలని 41 నుంచి 60 మంది వరకు విద్యార్థులుంటే ముగ్గురు ఉపాధ్యాయులుండాలనే నిబంధనను బట్టి రిలీవింగ్ ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కొన్ని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుంటే.. కూడా ఇద్దరు బదిలీ కావడం అలాంటప్పుడు మరో చోట నుంచి ఉపాధ్యాయుడు వస్తే రిలీవ్ చేయడం వంటివి చేస్తున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలోనూ ఎస్జీటీలు బదిలీ అయిన వారిలో సగం మంది వరకు కూడా రిలీవ్ చేయని పరిస్థితి నెలకొంది. డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీ తర్వాతే ఈ బదిలీ అయిన టీచర్లను ఆయా పాఠశాలల నుంచి రిలీవ్ చేసే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

హనుమకొండ జిల్లాలో 319 మంది బదిలీ

హనుమకొండ జిల్లాలో 354 మంది ఎస్‌జీటీ కేడర్ ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తులు చేసుకోగా వారిలో ఎస్‌జీటీలు 319 మంది బదిలీ అయ్యారు. ఈమేరకు ఆయా ఉపాధ్యాయులకు ఉత్తర్వులిచ్చారు. రేషనలైజేషన్ నిబంధన ప్రకారం.. వీరిలో దాదాపు సగం మంది తాము పనిచేస్తున్న పాఠశాలల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. భీమదేవరపల్లి ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు డీఈఓ కార్యాలయంలో తన పరిధిలోని నాలుగు మండలాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో కొందరికి రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వడం.. మరికొందరని జాయిన్ చేసుకోవడం వంటి ప్రక్రియ కొనసాగింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండేలా రిలీవ్ చేయాలని డీఈఓ ఎండీ అబ్దుల్‌హై ఎంఈఓలను ఆదేశించారు.



ఈఫొటోలో కన్నీటి పర్యంతం అవుతున్న టీచర్ పేరు బి.సుజాత. భీమదేవరపల్లి మండలం మల్లారం ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పని చేస్తున్నారు. ఈమె భర్త కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బదిలీ ప్రక్రియలో భాగంగా కమలాపూర్ ఎంపీపీఎస్‌కు బదిలీ ఆర్డర్ ఇచ్చారు. ఎంఈఓ వద్దకు రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని వెళ్తే.. రేషనలైజేషన్ నిబంధన ప్రకారం.. మీరు అక్కడే కొనసాగాలని చెప్పారు. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలలో 28 మంది విద్యార్థులున్నారు. భర్త అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయన్ని చూసుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని.. బదిలీ చేసి రిలీవ్ ఇవ్వకపోవడం సరికాదని ఆమె కన్నీటి పర్యంతం అయ్యారు.


డీఈఓ కార్యాలయంలో టీచర్లకు రిలీవ్ ఆర్డర్స్ ఇస్తూ.. వేరే చోట నుంచి వచ్చిన టీచర్లను జాయిన్ చేసుకుంటున్న భీమదేవరపల్లి ఎంఈఓ

వరంగల్‌జిల్లాలో 461 మందికి ఆర్డర్స్

వరంగల్ జిల్లాలో 801 మంది ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తులు చేసుకోగా.. అందులో 461 మందికి బదిలీ ఆర్డర్స్ ఇచ్చారు. వారిలో ఎంతమందిని రిలీవ్ చేస్తారో వేచి చూడాలి. కాగా.. హనుమకొండ, వరంగల్ జిల్లాలో పీఈటీ, లాంగ్వేజ్ పండిట్ల బదిలీలకు వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో హనుమకొండలోని 33 మందికి, వరంగల్‌లోని 33 మందికి సోమవారం రాత్రి బదిలీ ఆర్డర్స్ అందజేశారు.

బదిలీలు ఎందుకు చేపట్టినట్లు?



నేను 12 ఏళ్లకుపైగా మంగళపల్లి ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పని చేస్తున్నా. నాకు దామెర మండలం ఎంపీపీఎస్ పులుకుర్తికి బదిలీ అయ్యినట్లు ఆర్డర్ వచ్చింది. ఎంఈఓ వద్దకు వెళ్తే రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వలేదు. మంగళపల్లి పాఠశాలలో ఇద్దరు టీచర్లుంటే ఇద్దరం బదిలీ అయ్యాం. సీనియర్ టీచర్‌కు రిలీవ్ ఇచ్చి నాకు ఇవ్వలేదు. ఈబదిలీలు ఎందుకు చేపట్టినట్లు. రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వాలని కోరుతున్నా.

- అంజన్‌కుమార్ ఎస్‌జీటీ, మంగళపల్లి ఎంపీపీఎస్

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి


దామెర పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

దామెర: చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. మండలంలోని పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాల్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. నూతనంగా అమలవుతున్న భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ)లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఏఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

నూతన చట్టాలతో సత్వర న్యాయం


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: ప్రస్తుత పరిస్థితులకు అనుకూలంగా రూపొందించిన నూతన చట్టాల వల్ల బాధితులకు సత్వర న్యాయం కలుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం కమిషనరేట్‌లో నూతన చట్టాల అమలుపై జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలంలో తయారు చేసిన చట్టాలు ప్రస్తుత పరిస్థితులకు సరితూగట్లేదన్నారు. నేరస్తులకు తక్షణమే శిక్షలు పడేలా నూతన చట్టాలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్నట్లు తెలిపారు. మహిళలు, బాలికలపై దాడులు చేయాలంటే భయపడేలా నూతన చట్టంలో అనేక మార్పులు జరిగాయని పేర్కొన్నారు. దీంతో పాటు ఆన్‌లైన్ ద్వారా బాధితులు స్టేషన్‌కు రాకుండానే ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉందన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎస్‌హెచ్‌ఓలు ఉదయం 11 గంటల వరకే పోలీస్‌స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ జితేందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్, ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, శ్రీధర్‌రావు, రాఘవేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేయూ ఎంబీఏ 'రెండు పేపర్ల' పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 2, 4వ తేదీల్లో జరగాల్సిన ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. నర్సింహాచారి తెలిపారు. డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్స్ (వర్క్స్) గ్రేడ్–2 పరీక్ష నేపథ్యంలో ఆ రెండు రోజుల్లో జరిగే ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేశామని తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పేపర్–1 ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ ఈనెల 20న, పేపర్–2 పరీక్షను ఈనెల 22న నిర్వహిస్తామన్నారు. ఆ రెండు పరీక్షలు కూడా ఆయా రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

6 నుంచి ఎంసీఏ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంసీఏ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు (సీబీసీఎస్) రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక సోమవారం తెలిపారు. ఈనెల 6, 9, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

'అదిల్'కు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశం




హన్మకొండ అర్బన్: ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తన బాధను చెప్పుకుందామని కలవలేకపోయిన క్యాన్సర్ బాధిత బాలుడు మహమ్మద్ అదిల్ అహ్మద్ ఉదంతంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. తక్షణమే బాలుడికి మెరుగైన వైద్య సహాయం అందించాలని సీఎంఓ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్ బాలుడి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మాట్లాడారు. నెల క్రితం అదిల్ అహ్మద్ చికిత్స కోసం బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి రూ.లక్ష ఎల్‌ఓసీ ప్రభుత్వం మంజూరు చేసింది. కాగా.. ప్రస్తుతం అదిల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితిపై వేముల శ్రీనివాస్ ఆరా తీశారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా కావాల్సిన మరింత సాయం అందిస్తామని బాలుడి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

మరిపెడలో కొత్త సెక్షన్ల కింద కేసు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బావోజీగూడెం గ్రామానికి చెందిన అజ్మీరా సీతాలు.. పని నిమిత్తం మరిపెడకు వస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వాటర్ మెన్ ఉడుతపల్లి వెంకన్న పాత కక్షల నేపథ్యంలో సీతాలుపై బావోజిగూడెం చెరువు వద్ద దాడి చేశాడు. ఈ ఘటనపై గత నెల 29 మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన పోలీసులు.. నిందితుడిపై కొత్తగా అమల్లోకి వచ్చిన భారత న్యాయ సంహిత చట్టం ప్రకారం 126(2), 118 (1), 292 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై గుండ్రాతి సతీష్ తెలిపారు. అదే పాత సెక్షన్లు అయితే 341, 324, 290 కింద కేసు నమోదు అయ్యేదని ఎస్సై పేర్కొన్నారు.

ప్రమోషన్.. పరేషాన్



వల్కనైజర్ల పదోన్నతుల్లో వివక్ష

- ఒకే సంస్థలో ద్వంద్వ విధానాలు
- అధికారులకు నచ్చితేనే పదోన్నతులు..
- సర్క్యులర్‌లు ఉన్నా కనిపించవు
- ఆర్టీసీ టైర్ షాప్ కార్మికుల గోడు

హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ టైర్ వర్క్‌షాపులో పని చేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం, అధికారులు వివక్ష చూపుతున్నారు. ఒకే సంస్థలో పని చేస్తున్నా పదోన్నతులు కల్పించడంలో ద్వంద్వ విధానాలు అవలంబిస్తూ పరేషాన్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ టైర్ వర్క్ షాప్‌లో పని చేస్తున్న వల్కనైజర్లు 50 ఏళ్ల వయసు దాటితే వారికి ఎలాంటి డిపార్ట్‌మెంట్ టెస్ట్ లేకుండా లీడింగ్ హ్యాండ్‌గా పదోన్నతి ఇవ్వాలని ఆర్టీసీ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సర్క్యులర్ పీడీ–74/1989, జూన్ 21, 1989లో జారీ చేసింది. అయినా అధికారులకు ఈ సర్క్యులర్ కనిపించడం లేదు. వర్క్ షాప్ మేనేజర్‌కు అనుకూలంగా ఉన్న వారిని లీడింగ్ హ్యాండ్ పదోన్నతులకు ప్రతిపాదనలు పంపుతూ మిగతా వారి పట్ల వివక్ష చూపుతున్నారని కార్మికులు మొత్తుకుంటున్నారు.

అక్రమాలపై చర్యలు శూన్యం

కరీంనగర్ జోనల్ (వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ రీజినల్) టైర్ వర్క్ షాప్‌లో 28మంది ఉద్యోగులు ఉన్నారు. నెలకు 2 వేల టైర్లు రీట్రేడింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో లీడింగ్ హ్యాండ్ పదోన్నతుల్లో అక్రమాలు, అవకతవకలు జరగడంతో ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు కొన్నేళ్ల క్రితం విచారణ చేపట్టారు. అయినా అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపించలేదని కార్మికులు తెలిపారు. 2015లో లీడింగ్ హ్యాంట్ పదోన్నతి కోసం కరీంనగర్ జోనల్ టైర్ వర్క్‌షాప్ వల్కనైజర్లకు డిపార్ట్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో అప్పటి అధికారి ఒకరు తనకు అనుకూలంగా ఉన్న నలుగురు వల్కనైజర్‌లకు సాయం చేసేందుకు అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డారని కార్మికులు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. జవాబు పత్రాలన్నీ ఒకే హ్యాండ్ రైటింగ్‌తో పరీక్ష హాల్ బయట రాయించుకుని వచ్చి నలుగురు ఉద్యోగులు స్వయంగా రాసిన జవాబు పత్రాలు తీసివేసి బయట నుంచి తీసుకువచ్చిన ఆ జవాబు పత్రాన్ని చేర్చారనే ఆరోపణలు వెలువడ్డాయి. ఈ నలుగురు ఉత్తీర్ణులు కావడంతో వారికి రెండేళ్ల తర్వాత పదోన్నతులు కల్పించారు. దీనిపై ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు విచారణ చేశారు. తర్వాత డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీ చేయాల్సి ఉన్నా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి నిలిపి వేయించారని కార్మిక వర్గాలు మొత్తుకుంటున్నాయి. కొంత మంది సమాచార హక్కు చట్టం ప్రకారం వారు రాసిన జవాబు పత్రాల ప్రతులు ఇవ్వాలని కోరినా ఇవ్వలేదు. దీంతో ఈ పరీక్షలో కచ్చితంగా అక్రమాలు జరిగి ఉంటాయనే వాదనకు మరింత బలం చేకూరుతోంది.

సర్క్యులర్ ఉన్నా పట్టించుకోని అధికారులు..



50 ఏళ్ల వయసు నిండిన వల్కనైజర్లకు ఎలాంటి డిపార్ట్‌మెంట్ టెస్ట్ లేకుండా లీడింగ్ హ్యాండ్‌గా పదోన్నతి కల్పించాలని సర్క్యులర్ ఉన్న కొందరు అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇదే సర్క్యులర్ ప్రకారం హైదరాబాద్ జోన్ ఉప్పల్ టైర్ వర్క్‌షాపులో 50 ఏళ్లు నిండిన వల్కనైజర్లకు లీడింగ్ హ్యాండ్‌గా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ జోన్‌లోని కరీంనగర్ టైర్ వర్క్‌షాపులో పని చేస్తున్న 50 ఏళ్లు నిండిన వల్కనైజర్లకు మాత్రం పదోన్నతి ఇవ్వకుండా వివక్ష చూపుతూ ద్వంద్వ విధానాలు అవలంబిస్తున్నారు. అదే విధంగా 20 సంవత్సరాల సర్వీస్ ఇంక్రిమెంట్ 2018 నుంచి ఇవ్వాల్సి ఉన్న ఇవ్వడం లేదని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. కరీంనగర్ జోన్ కరీంనగర్ వర్క్‌షాప్‌లో పదోన్నతుల్లో జరిగిన అక్రమాలు, అవకతవకపై, జరుగుతున్న అన్యాయంపై కొందరు ఉద్యోగులు హైదరాబాద్‌లో జరిగిన ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించారు. కొందరు అధికారులు కొందరు ఉద్యోగులపై ప్రేమ చూపించడం, మరికొందరు ఉద్యోగులపై వివక్ష చూపించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికైనా స్పందించి 50 ఏళ్లు నిండిన వల్కనైజర్లకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

మట్టి, ఇసుక కావాలి

- దక్షిణ కొరియా యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధులు
- టెక్స్‌టైల్ పార్కులో కంపెనీ పనులపై సమీక్ష
- సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ



కేఎంటీపీలో హెలిపాడ్ వద్ద దక్షిణ కొరియా యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధులు

గీసుకొండ: వరంగల్ జిల్లాలోని గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)ను దక్షిణ కొరియాకు చెందిన క్రీడా దుస్తుల తయారీ కంపెనీ(ఈటీఎల్) యంగ్‌వన్ ఎవర్ టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సోమవారం సందర్శించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో యంగ్‌వన్ గ్రూపు చైర్మన్ అండ్ సీఈఓ కిహాక్‌సంగ్, గ్రూపు ప్రెసిడెంట్ మిన్‌షక్‌లీ, కేఈపీజెడ్ అండ్ ఈటీఎల్ డైరెక్టర్ ఎండీ. షాజహాన్‌తో పాటు పలువురు కంపెనీ ప్రతినిధులు కేఎంటీపీకి వచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మహిళల కుట్టు శిక్షణ ట్రెనింగ్ సెంటర్‌ను పరిశీలించారు. అయితే కంపెనీ పనులు త్వరితగతిన చేపట్టడానికి ఇసుక, మట్టి కొరత ఉందని , వాటిని సమకూర్చాలని కోరగా కలెక్టర్ నుంచి అనుమతి తీసుకుని సమకూరుస్తామని టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ రామ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా సాయంత్రం కంపెనీ పనులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కానున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కేఎంటీపీలో మొత్తం 297 ఎకరాల్లో రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో యూనిట్‌ను నెలకొల్పడానికి పనులు జరుగుతున్నాయి. 2023 జూన్ 17న అప్పటి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ భూమి పూజ చేసినా పనులు కొంత నెమ్మదిగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం కుట్టు శిక్షణ కోసం మహిళలకు ట్రెనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం మినహా పెద్దగా పనులేమీ జరగలేదు.

కళాశాలలో మౌలిక వసతుల కల్పన

- కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ



ఫలితాలు విడుదల చేస్తున్న వాకాటి కరుణ

హన్మకొండ అర్బన్ : పింగిళి కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని కేయూ ఇన్‌చార్జ్ వీసీ, మహిళా, శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ వాకాటి కరుణ తెలిపారు. సోమవారం వాకాటి కరుణ హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన ఛాంబర్‌లో నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) డిగ్రీ 2023–24 సంవత్సర బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ల ఫలితాలను క్యూఆర్ కోడ్ విధానంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదవడం వల్లే ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. ఇండియా టుడే నిర్వహించిన బెస్ట్ కాలేజీస్ ఆఫ్ ఇండియా సర్వేలో మొదటి పది ర్యాంకులలో పింగిళి కళాశాల ఉండడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో 486 మంది విద్యార్థులకు 278 పాసై 57.20 శాతం ఉత్తీర్ణత, రెండో సంవత్సరం నాలుగో సెమిస్టర్‌లో 440 మందికి గాను 243 పాసై 55.23 ఉత్తీర్ణత, ఆరో సెమిస్టర్‌లో 406 విద్యార్థులకు గాను 370 పాసై 85.96 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల విభాగం అధికారి రామకృష్ణారెడ్డి, అడిషనల్ కంట్రోలర్స్ రేణుక, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అకడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, సురేష్‌బాబు, తిరువెంగళాచారి పాల్గొన్నారు.

ప్రజావాణికి 165 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

హన్మకొండ అర్బన్: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈవారం మొత్తం 165 వినతులు అందాయి. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, వెంకట్‌రెడ్డి ఇతర అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు సత్వరం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాగా.. ఎల్కతుర్తి పీఏసీఎస్‌లో అధ్యక్షులు అక్రమాలకు పాల్పడుతున్నారని, సరైన తీర్మానాలు లేకుండా నిధులు అక్రమంగా ఖర్చు చేస్తున్నారని.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఆరేళ్లుగా రేషన్‌కార్డులివ్వలేదు..



మాది పేద కుటుంబం. మాకిద్దరు పిల్లలు. చదువుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అన్ని పథకాలకు రేషన్‌కార్డు అడుగుతోంది. బియ్యం ఇతర సామాగ్రికి కార్డు అవసరం. గత ప్రభుత్వం రేషన్‌కార్డులివ్వలేదు. కొత్త ప్రభుత్వమైనా వెంటనే రేషన్‌కార్డులు మంజూరు చేయాలి.

– సురేశ్, హసన్‌పర్తి

దివ్యాంగురాలిని.. ఇల్లు లేదు..



నేను దివ్యాంగురాలిని. ఉండడానికి ఇల్లు లేదు. ప్రభుత్వం మాకు ఎల్కతుర్తి మండలం బాహుపేట బీసీ కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేసింది. అక్కడ ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేదు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందించాలి.

– మహ్మద్ రశీద, బాహుపేట

కూలీ దారుణ హత్య

- రాయితో కొట్టి చంపినట్లు భావిస్తున్న స్థానికులు
- వరంగల్ బట్టలబజార్‌లో ఘటన
- బీఎన్‌ఎస్‌ఎస్ చట్టం కింద మట్టెవాడ పీఎస్‌లో తొలి కేసు నమోదు



ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ నందిరాం

రామన్నపేట : ఓ కూలీ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వరంగల్ బట్టలబజార్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థాన పక్క గల్లీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎల్లంబజార్‌లో నివాసముంటున్న పూసల వీరభద్రచారి(52) కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం పనికి వెళ్లి వచ్చిన చారి.. రాత్రి 9.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అనంతరం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో రక్తపు మడుగులో మృతిచెంది ఉన్నాడు. దీనిని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలిని పరిశీలించి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడు పక్కన పెద్ద రాయి రక్తపు మరకలతో ఉంది. దీంతో రాయితో తలపై మోదీ చంపినట్లు ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి ఇంటి నుంచి క్షేమంగా బయటకు వెళ్లిన వీరభద్రచారి.. రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

హత్య ఘటన స్థలాన్ని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ సందర్శించారు. వీరభద్రచారి హత్యకు గురయ్యాడా? లేక ఇతర ప్రమాదమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన చుట్టూ పక్కల ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీ సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. కాగా, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు బీఎన్‌ఎస్‌ఎస్ (భారత్ న్యాయ సంహిత) 103(1) చట్టం కింద తొలి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు.

పలు రైళ్లు దారి మళ్లింపు

- తెలంగాణ సూపర్‌ఫాస్ట్‌కు అప్‌అండ్‌డౌన్‌లో తాత్కాలిక హాల్టింగ్ ఎత్తివేత

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు సోమవారం . కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో మూడో రైల్వే లైన్ కారణంగా కాజీపేట మీదుగా అప్ అండ్ డౌన్ చేసే పలు రైళ్లను దారి మళ్లించి నడిపిస్తున్నట్లు తెలిపారు.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు

గోరఖ్‌పూర్–యశ్వంత్‌పూర్ (12591) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 6 నుంచి జూలై 7వ తేదీ వరకు, యశ్వంత్‌పూర్–గోరఖ్‌పూర్ (12592) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 24 నుంచి జూలై 1వ తేదీ వరకు, గోరఖ్‌పూర్–సికింద్రాబాద్ (12589) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 26 నుంచి జూలై 3వ తేదీ వరకు, సికింద్రాబాద్–గోరఖ్‌పూర్ (12590) వీక్లీ ఎక్స్‌ప్రెస్ జూన్ 27 నుంచి జూలై 4వ తేదీ వరకు, సికింద్రాబాద్–న్యూఢిల్లీ (12723) తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ ట్రెన్ జూలై 4,5,6 తేదీల్లో, న్యూఢిల్లీ–హైదరాబాద్ (12724) తెలంగాణ సూపర్ ఫాస్ట్ రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ జూలై 3,4,5వ తేదీల్లో వయా నిజామాబాద్ మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించినట్లు తెలిపారు. దారి మళ్లింపు కారణంగా ఈ రైళ్లకు బల్లార్షా, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, కాజీపేట జంక్షన్‌లో తాత్కాలికంగా హాల్టింగ్ ఎత్తివేసినట్లు తెలిపారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ ఎంపికలు



రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్–8,10,12 బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఎంపికల్లో జిల్లా నలుమూలల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 15 మంది క్రీడాకారులను ఈ నెల 7వ తేదీన గోపీచంద్ అకాడమీ గచ్చిబౌలిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కాగా, సంఘం రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఈటీలు కృష్ణమూర్తి, మహేందర్, నాగరాజు, శ్రీలత, రమేష్, శ్రీనాథ్, సతీష్ , శ్రీనివాస్, కోచ్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని రైతు దుర్మరణం

- పైడిపల్లిలో ఘటన



రాజయ్య(ఫైల్)

పరకాల: స్కూల్ బస్సు ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం పరకాల మండలం పైడిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాగుల రాజయ్య(65) బైక్‌పై పరకాల వచ్చి మిరపనారు కొనుగోలు చేశాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పైడిపల్లిలోని మలుపు వద్ద స్కూల్ బస్సు ఢీకొంది. దీంతో రాజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డీఎస్ కాంగ్రెస్‌కు చేసిన సేవలు మరువలేనివి

- మంత్రి సీతక్క



డీఎస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సీతక్క, రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ రాజయ్య

ఖిలీల్‌వాడి: సీనియర్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మర్చిపోలేనివని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి సీతక్క అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లోని డీఎస్ నివాసంలో డీఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌ను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ డీఎస్ రెండు సార్లు పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేశాడన్నారు. డీఎస్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటని చెప్పారు. డీఎస్ ఆశయాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లు అని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య అన్నారు. మంత్రి సీతక్కతో కలిసి డీఎస్ చిత్రపటానికి ఆయన నివాళులు అర్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ I, Billa Udaykumar Reddy, S/o. Sudhakar Reddy (Old name) H.No.55-4-974/1, Yerragattu gutta, Bhimaram, Hasanparthy Mdl, Warangal, 506005, Telangana State, have changed my name as Billa Udaykumar (New Name) for all future purposes. [W-1242496]

BEAUTICIAN / BEAUTY PARLOR

■ శ్రీశైలీ బ్యూటీపార్లర్ నందు గవర్నమెంట్ సర్టిఫికేట్‌తో Free Training ఇవ్వబడును. శ్రీశైలీ బ్యూటీ పార్లర్ చౌరస్తా, హన్మకొండ. సెల్: 9989060668. [WA-6503]

WANTED

■ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సూపర్ వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000–14000, 8 గం॥ 12 గం॥ కలవు. సెల్ నెం: 9000463426. [W-1264977]

■ ఒమెగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటి పని/వంట పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [H-799899]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-13695]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185230]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యువకుడిపై గంజాయి గ్యాంగ్ దాడి

- చెన్నారెడ్డి కాలనీలో ఘటన
- ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదని ప్రచారం
- ఒక్కటైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు
- అధికార పార్టీ నేత అనుచరుడి కనుసన్నల్లో రాజీ



యువకుడిపై దాడి చేస్తున్న యువకులు(సీసీ ఫుటేజీ)

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో ఆదివారం రాత్రి ఓ యువకుడిపై అదే కాలనీకి చెందిన కొందరు యువకులు(గంజాయి సేవించే గ్యాంగ్) దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. గరీబ్‌నగర్‌కు చెందిన యువకుడు ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో చెన్నారెడ్డికాలనీలోని బంధువుల ఇంటికి బైక్‌పై వస్తుండగా అదేకాలనీకి చెందిన కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. స్థానికులు ఆపే ప్రయత్నం చేస్తే వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. దీంతో సదరు యువకుడి బంధువులు డయల్ 100కు కాల్ చేయగా మిల్స్‌కాలనీ పోలీసులు వచ్చి బైక్ ఫొటోలు తీసుకుని యువకుడిని ఎంజీఎం వెళ్లమని ఉచిత సలహా ఇచ్చి వెళ్లిపోయారు. చికిత్స పొందిన యువకుడు సోమవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఘటన బయటకు తెలియడంతో దాడికి పాల్పడిన యువకుల బంధువులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో మధ్యాహ్నం డివిజన్‌కు చెందిన అధికార, ప్రతిపక్షాల నాయకులను సంప్రదించారు. ఈమేరకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు తూర్పు నేత ప్రధాన అనుచరుడి కనుసన్నల్లో రాజీ కుదిర్చినట్లు ప్రచారం జరుగుతోంది. చెన్నారెడ్డి కాలనీలో కొంత కాలంగా కొందరు యువకులు గంజాయి సేవిస్తూ గ్యాంగ్‌గా ఏర్పడి అల్లర్లకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎవరైనా ఎదురు తిరిగితే వారిపై దాడి చేయడానికి కూడా ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఇలాంటి ఘటనలపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే కాలనీలో రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేయాలని కోరుతున్నారు.

'వనమహోత్సవ' కార్యాచరణ సిద్ధం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారదాదేవి



గ్రీవెన్స్‌లో సమస్యలు వింటున్న కలెక్టర్ సత్యశారదాదేవి

- వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు పటిష్ఠ కార్యాచరణను సిద్ధం చేయాలని వరంగల్ కలెక్టర్ సత్యశారదా దేవి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా ఈ నెల 7వ తేదీలోగా సామూహికంగా మొక్కలు నాటేందుకు జిల్లాలో అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకొని సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాసరావు, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎఫ్ఆర్ఓ సదానందం, డీపీఎం రేణుక, డిప్యూటీ డీఆర్‌డీఓ పాల్గొన్నారు.

'ధరణి' దరఖాస్తులు పరిష్కరించాలి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారదాదేవి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ధరణి పెండింగ్ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 792 దరఖాస్తులను పరిష్కరించగా, పెండింగ్‌లో ఉన్న 2,962 దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలన్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించండి

వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి జనం బారులుదీరారు. ప్రజల నుంచి స్వీకరించిన కలెక్టర్ సత్యశారదాదేవి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్‌లో రెవెన్యూ శాఖ 85, మున్సిపల్ కార్పొరేషన్ 6, ఉపాధి శాఖ 6, డీఆర్‌డీఓ 4, మొత్తం 132 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, 'కరోనా ముందు పింఛన్ ఇచ్చిండ్రు. ప్రస్తుతం రావడం లేదని, వృద్ధాప్య పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి' అని శివనగర్‌కు చెందిన చెరుకు దశరథం వినతిపత్రం అందించాడు.